సాక్షి ఖమ్మం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



పెన్షన్.. టెన్షన్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు నేడు నిరసన తెలపనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 28° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది. అన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా శ్రీజ



పి.శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పి.శ్రీజ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్‌లను శనివారం బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న పి.శ్రీజను ఖమ్మం బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సత్యప్రసాద్ ఇటీవల జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి డీఆర్‌డీఓ సన్యాసయ్య ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ స్థానంలో 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీజను శనివారం నియమించగా ఆమె ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ఖమ్మం లీగల్: ఈనెల 28న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ సూచించారు. ఆయన శనివారం పోలీసు, న్యాయాధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈనెల 14నే జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గణేష్ ఉత్సవాల బందోబస్తులో పోలీసులు పాల్గొనాల్సి ఉండడంతో 28న నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. అదనంగా సమయం లభించిన నేపథ్యాన అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా జడ్జి తెలిపారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా సైబర్ క్రైమ్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని వెల్లడించారు. న్యాయమూర్తులు వి.అపర్ణ, కే.వీ.చంద్రశేఖరరావు, వి.మాధవి, ఆర్.శాంతిలత, బి.రజిని, అదనపు డీసీపీ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

- ఈనెల 23నుంచి గోల్కొండ, ఇంటర్‌సిటీ, 25నుంచి శాతవాహన

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా మరోమారు రైళ్లను రద్దు చేయనున్నారు. ఈ వివరాలను ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ వెల్లడించారు. గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) ఈనెల 24నుంచి అక్టోబర్ 8వరకు, సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ(17202) ఈనెల 23నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రానుపోను మార్గాల్లో(12706, 12705) ఈనెల 23నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు, సికింద్రాబాద్-విజయవాడ మార్గంలో నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12714, 12713) రెండు వైపులా ఈనెల 25నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రద్దవుతాయని తెలిపారు. అలాగే, కాజీపేట-విజయవాడ(07753), విజయవాడ - కాజీపేట(07754), డోర్నకల్ - విజయవాడ (07755)), విజయవాడ - డోర్నకల్ (07756) ప్యాసింజర్ రైళ్లను ఈనెల 25నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

అప్రమత్తతోనే వ్యాధులకు దూరం



ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న డీఎంహెచ్‌ఓ సుబ్బారావు

ఖమ్మంఅర్బన్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. ఖమ్మంలోని ఖానాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. వైద్యపరీక్షలకే పరిమితం కాకుండా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ప్రజలు కూడా ఇళ్లతో పాటు పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. అనంతరం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు. ఖానాపురం హవేలీ పల్లె దవాఖానా డాక్టర్ శ్రేయ, ఉద్యోగులు గోలి రమాదేవి, తాళ్లూరి శ్రీకాంత్, ప్రమీల, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి మొదలైన వాన శనివారం రాత్రి వరకు కొనసాగింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. వాగులు పొంగడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా మధిర నియోజకవర్గాన్ని వర్షం ముంచెత్తింది. శనివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎర్రుపాలెం మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 21.3 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. మధిరలో 20.2 సెం.మీ. వర్షం కురిసింది. అలాగే ఖమ్మం నగరంతో పాటు బోనకల్, ముదిగొండ, వైరా, వేంసూరు, సత్తుపల్లి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం తదితర మండలాల్లోనూ వర్షప్రభావం కనిపించింది. మధిర నియోజకవర్గంలో భారీ వర్షాల నేపథ్యాన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటన రద్దు చేసుకుని హుటాహుటిన జిల్లాకు బయలుదేరారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లోకి చేరిన ఊరచెరువు వరద

అత్యధికంగా ఎర్రుపాలెంలో 21.3 సెం.మీ. వర్షపాతం

- జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేని వాన
- మధిర నియోజకవర్గాన్ని ముంచెత్తిన వర్షం
- ఎర్రుపాలెంలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయి వర్షపాతం
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు.. వరదలో కొట్టుకుపోయి ఒకరు మృతి
- హుటాహుటిన మధిర బయలుదేరిన డిప్యూటీ సీఎం భట్టి
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించిన డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి

జిల్లావ్యాప్తంగా ముసురు

జిల్లాలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షం మొదలై కొద్దిసేపు విరామం ఇస్తూ ఆ వెంటనే మొదలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఖమ్మం నగరంలో పలుచోట్ల రోడ్లపైకి నీరు వచ్చింది. మధిర పట్టణంలో రోడ్లన్నీ జలమయం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇంకొన్ని చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వర్షాకాలంలో ఇదే పెద్ద వర్షం కాగా, మరో రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

మధిర అతలాకుతలం

మధిర నియోజకవర్గంలో అత్యధికంగా వర్షం కురిసింది. ఎర్రుపాలెం మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో 21.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఎర్రుపాలెం మండలం నరసింహాపురం -రాజుపాలెం మధ్య వాగు పొంగి పొర్లుతుండగా ఓ ద్విచక్ర వాహనదారుడు కొట్టుకుపోయాడు. ఆ తర్వాత పట్టు దొరకడంతో ఆగిన ఆయన ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా స్థానికులు రక్షించారు. అలాగే, మామునూరుపేట చెరువు అలుగువాగులో కొట్టుకుపోతున్న ఇద్దరిని స్థానికులు బయటకు తీసుకొచ్చారు. భీమవరం – భవానీపురం మధ్య నక్కలవాగుకు వరదలో గల్లంతైన మలిశెట్టి సాంబశివరావు(19) మృతి చెందాడు. మధిర మండలంలోని దెందుకూరులో నన్నెబోయిన పద్మ(30) గల్లంతైనట్లు తెలిసింది. బోనకల్ మండలం చిన్నబీరవల్లి -రాపల్లి రహదారిపై పెదవాగు ఉధృతితో, చింతకాని మండలం నాగులవంచ వద్ద కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రికార్డు స్థాయిలో వర్షపాతం

జిల్లాలో సగటున శుక్రవారం నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 6.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యధికంగా ఎర్రుపాలెం మండలంలో 19.3 సెం.మీ., మధిరలో 9.2, బోనకల్‌లో 8.4, వేంసూరులో 7, వైరాలో 6.9, సత్తుపల్లిలో 6.8, రఘునాథపాలెంలో 6.6, నేలకొండపల్లిలో 6.2, తల్లాడ, కొణిజర్లలో 6.1, తిరుమలాయపాలెంలో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేని వర్షంతో నేలకొండపల్లి మండలంలో పాలేరు ఏరు పొంగి పొర్లుతుండడంతో సుద్దేపల్లి వద్ద సూర్యాపేట జిల్లా పాలారం వెళ్లే రహదారిని మూసివేశారు. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు–మేడిదపల్లి మధ్య కూడా చప్టా పొంగి ప్రవహిస్తోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఉమ్మడి కరీంనగర్ పర్యటనలో ఉన్న భట్టి హుటాహుటిన మధిర బయలుదేరారు. మార్గమధ్యలోనే ఫోన్ ద్వారా ఖమ్మం కలెక్టర్, కేఎంసీ కమిషనర్‌తో మాట్లాడి సూచనలు చేశారు. ఇక పొంగులేటి సైతం ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని చెప్పారు. కాగా, వరదల నేపథ్యాన అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని వారు సూచించారు. ఇబ్బందులు తలెత్తితే అధికారులకు సమాచారం ఇవ్వాలని డిప్యూటీ సీఎం, మంత్రితో పాటు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు.



మధిరలో రహదారిపై నిలిచిన వరదనీరు

శనివారం ఉదయం 8.30 నుంచి రాత్రి 10గంటల వరకు అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.ల్లో)

ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం
ఎర్రుపాలెం	21.3	ముదిగొండ	9.7	కొణిజర్ల	6.9
మధిర	20.2	కూసుమంచి	7.7	పెనుబల్లి	5.2
బోనకల్	10.6	తిరుమలాయపాలెం	7.6	ఖమ్మం	5.1
నేలకొండపల్లి	9.8	చింతకాని	7.2	రఘునాథపాలెం	5.0



ఉప్పొంగి ప్రవహిస్తున్న మధిర చెరువు

◆ జిల్లాకు రెడ్ అలెర్ట్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యాన అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కాగా, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసేలా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈమేరకు 90632 11298, 1077 నంబర్లకు ఫోన్ చేయొచ్చని వెల్లడించారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద మత్తడి పొంగిపార్లే ప్రాంతాలను గుర్తించి అధికారులు 24 గంటల పాటు పర్యవేక్షించాలని.. వరద ఉధృతి ఉన్న చోట రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. ఈసమీక్షలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ జాగ్రత్తగా ఉండండి...



ప్రజలకు సూచనలు చేస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంతో పాటు ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మున్నేరులోకి భారీగా వరద చేరుతోంది. శనివారం రాత్రి కాల్వొడ్డు వద్ద మున్నేరు నీటిమట్టం 11అడుగులు దాటింది. ఇంకా వరద పెరిగే అవకాశముందన్న సూచనలతో పరీవాహక ప్రాంతాల ప్రజలను కేఎంసీ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఖమ్మంలోని మున్నేరు పరీవాహక ప్రాంతంలోని రామన్నపేట, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, బొక్కలగడ్డ, ధంసలాపురంల్లో పర్యటించిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

◆ ఏపీకి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో రహదారులపైకి వరద చేరింది. దీంతో జిల్లా నుండి ఏపీలోని విజయవాడ, తిరుపతి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ఇక మధిర చుట్టూ వరద నీరు ముంచెత్తడంతో మధిర నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులను సైతం రద్దు చేసినట్లు వెల్లడించారు. మధిర పట్టణానికి సర్వీసులన్నీ నిలిపివేయగా, మధిర నుండి కల్లూరు మార్గంలోనూ సర్వీసులు నిలిపేశారు. అంతేకాక ఖమ్మం నుండి సుబ్లేడు – రఘునాథపాలెం, ఖమ్మం -కోదాడ సర్వీసులకు కూడా అంతరాయం ఏర్పడింది.

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాన్ని శనివారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెసల నాణ్యతను పరిశీలించిన ఆయన ప్రమాణాల ఆధారంగా మద్దతు ధరతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దళారుల ప్రమేయం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సునీత, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనుగోళ్లు నిల్

ఖమ్మం మార్కెట్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పెసల కొనుగోలు కేంద్రంలో రెండో రోజైన శనివారం కూడా కొనుగోళ్లు జరగలేదు. ప్రైవేట్ మార్కెట్‌లో పెసల ధర తక్కువగా ఉండడంతో రైతులు నష్టపోకుండా మద్దతు ధర రూ.8,682తో కొనుగోలు చేసేలా ఈ కేంద్రం ఏర్పాటుచేశారు. కొనుగోలు బాధ్యతలను డీసీఎంఎస్‌కు అప్పగించగా, తొలిరోజైన శుక్రవారంతోపాటు శనివారం కూడా కొనుగోళ్లు చేయలేదు. శనివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌లో పెసల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించినప్పటికీ కొనుగోలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెసల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

‘సహకారం’లో సమన్వయ లేమి

- సీఈఓ నిర్ణయాలపై డీసీసీబీ డైరెక్టర్ల ఆగ్రహం
- రైతుల బీమా ప్రీమియంపై రగడ
- విచారణకు ఆదేశించిన మంత్రి తుమ్మల

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో పాలకవర్గం, ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) నడుమ సమన్వయం లోపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చైర్మన్ కూరాకుల నాగభూషణం పదవి కోల్పోయారు. ఆతర్వాత వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్‌గా అవకాశం దక్కింది. అప్పటి నుంచే కొందరు డైరెక్టర్లు చైర్మన్ ఎన్నిక నిర్వహించాలనే డిమాండ్‌తో సమావేశాలను బహిష్కరిస్తున్నారు. ఇదే సమయాన సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ తీసుకున్న నిర్ణయాలపై దుమారం లేచింది. ఉద్యోగుల బదిలీలు, ఎరియర్స్, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల బకాయిలు రూ.78లక్షల మేర సీఈఓ ఏకపక్షంగా చెల్లించారని చైర్మన్, డైరెక్టర్లు ఆరోపించారు.

రైతుల జీవిత బీమాపై రగడ

రైతుల ఇన్సూరెన్స్‌పై కొత్త వివాదం తెరపైకి వచ్చింది. గతంలో సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్న రైతు మరణిస్తే రూ.50 వేల బీమా పరిహారం అందేది. గత పాలకవర్గంలో రూ.2 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రీమియం చెల్లింపు వ్యవహారంలో సీఈఓ తీసుకున్న నిర్ణయాన్ని పాలకవర్గం తప్పుపడుతోంది. ఎల్ఐసీ రూ.660.80గా, ఎస్‌బీఐ లైఫ్ రూ.646 ప్రీమియం కోడ్ చేయడంతో నిబంధనల ఎస్‌బీఐ లైఫ్ కంపెనీకి సీఈఓ అప్పగించారు. అయితే, పాలకవర్గం ప్రమేయం లేకుండా నిర్ణయించారని, ఇందులో అక్రమాలు జరిగాయని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే శనివారం బ్యాంక్ కార్యాలయంలో జరిగిన ఆడిట్ కమిటీ, రిస్క్ మేనేజ్ కమిటీ సమావేశంలో చైర్మన్, డైరెక్టర్లు.. సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాత్రం ఉద్యోగుల బకాయిల చెల్లింపు, బదిలీలతో పాటు జీవిత బీమా అంశంలో నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లానని స్పష్టం చేశారు.

విచారణకు మంత్రి తుమ్మల ఆదేశం

డీసీసీబీలో పలు అక్రమాలు జరుగుతున్నాయని.. ఇందులో సీఈఓ, ఇతర అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఆదేశించారు. టీజీకాబ్ ఎండీ గోపి, రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. అక్రమాలు రుజువైనా, బ్యాంకు సొమ్ము దుర్వినియోగం జరిగినట్లు తేలినా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే, రుణమాఫీ పథకంలో డీసీసీబీ, పీఏసీఎస్‌ల తీరుతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి తుమ్మల తెలిపారు. ఇప్పటికే హెచ్చరించినా తీరు మారనందున ఇకపై ఉపేక్షించేది లేదని వెల్లడించారు.

మెరుగైన వైద్యంతో ప్రజల్లో నమ్మకం పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించడం ద్వారా భరోసా కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను శనివా రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఫార్మసీతో పాటు వార్డులను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే వారితో ప్రేమపూర్వకంగా మెలగాలని, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కాగా, జ్వరాలతో చేరుతున్న వారి కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గర్భిణుల కోసం ఏర్పాటుచేసిన మెడిటేషన్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆపై కాన్పుల వార్డు, ఐసీయూ, నవజాత శిశు సంరక్షణ కేంద్రం, తల్లిపాల కేంద్రాన్ని కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, ఆర్ఎంఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంసీహెచ్‌లో నవజాత శిశువును లాలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నిరసనలను జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న టీజీఈజేఏసీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఆదివారం చేపట్టనున్న నిరసనలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఎంప్లాయీస్ జేఏసీ(టీజీఈజేఏసీ) బాధ్యులు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ ఎగ్గొట్టే కుట్ర పన్నాయని ఆరోపించారు. సీపీఎస్ అంతం.. జేఏసీ పంతం అనే నినాదంతో ఉద్యమిస్తున్నామని, ఇందులో భాగంగా ఆదివారం చేపట్టే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. టీఎన్జీవో, టీజీఓస్ నాయకులు కొణిదెన శ్రీనివాస్, జైపాల్, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రితో పాటు జేఏసీ, వివిధ సంఘాల నాయకులు డి.సైదులు, పారుపల్లి నాగేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్, ఏ.వీ.నాగేశ్వరరావు, యాదగిరి, మన్సూర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI · సాక్షి · సాక్షి SAKSHI TV · SAKSHI DIGITAL



HARVEST SPRING LEAF SCHOOL
NURSERY TO X DAY & RESIDENTIAL
Near Rajiv Gruhakalpa, Karunagiri, KHAMMAM

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. సాక్షి మీడియా గ్రూప్, హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ స్కూల్ వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 6వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5నుంచి 16సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా

హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ స్కూల్,రాజీవ్ గృహకల్ప సమీపంలో కరుణగిరి, ఖమ్మం

తేది: 06-09-2024 శుక్రవారం

సమయం: మ. 1.00 గం.ల నుంచి సాయంత్రం 4.00 గం.ల వరకు

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

ఫోన్ నంబరు : 9666013544

క్లుప్తంగా

రిటైర్డ్ పోలీస్ అధికారులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన వారితో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన అధికారులను కమిషనర్ సునీల్‌దత్ శనివారం సన్మానించారు. కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులు శాఖకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అలాగే, విధి నిర్వహణలో ఉద్యోగులకు తోడ్పాటునందించిన కుటుంబ సభ్యులను అభినందించారు. రిటైర్డ్ అయిన వారిలో ఈమేరకు ఎస్సై సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏఎస్సైలు కె.వెంకటేశ్వర్లు, వి.రామారావు, డీ.వీ.నారాయణ, ఏఆర్ ఎస్సై షేక్ బీజాపూర్ ఫరూక్, హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజుతో పాటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు తప్పనిసరి

మధిర: గణేశ్ మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించేలా పోలీసులు అవగాహన కల్పించాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించాక ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. వినాయకచవితిని పురస్కరించుకొని గణేశ్ ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీలతో సమావేశమై సూచనలివ్వాలని తెలిపారు. ప్రతీ గణేశ్ మండపాన్ని సెక్టార్ ఇన్‌చార్జ్‌లు పరిశీలించాలని, అనుమతి కోసం ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ధ్రువీకరించాలని చెప్పారు. అలాగే, గణేశ్ విగ్రహాల నిమజ్జన రోడ్డు మార్గం, ఏర్పాట్లపై ముందుగానే దృష్టి సారించాలని సూచించారు.

18.7 అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్

వైరా: జిల్లాలో వర్షాల నేపథ్యాన వైరా రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో పూర్తిస్థాయి నీటిమట్టమైన 18.3 అడుగులు దాటి 18.7 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లోకి 700 క్యూసెక్కుల నీరు చేరిందని ఐబీ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్ సూచించారు. ఖమ్మంలోని సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడారు. డేటా బేస్ సమాచారం ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలను అరికట్టాలని, స్తంభాలకు నంబర్లు వేసే ప్రక్రియలో వేగం పెంచి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే, వ్యవసాయ సర్వీసులు మంజూరు చేయాలని తెలిపారు. ఇక వినియోగదారుల బిల్లింగ్, చెల్లింపుల్లో మానవ ప్రమేయాన్ని తగ్గించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ నెల 17 నుంచి నిర్వహించే ప్రజాపాలనలో అర్హులై ఉండి గృహజ్యోతి పొందని వారు దరఖాస్తు చేసుకునేలా ప్రచారం చేయాలని ఎస్ఈ సూచించారు.

నర్సరీల లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

వైరా/మధిర: మిరప నర్సరీల నిర్వాహకులు లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ సూచించారు. వైరా, మధిరలోని రైతువేదికల్లో శనివారం నర్సరీ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన యజమానులకు సూచనలు చేశారు. లైసెన్స్ లేకుండా నర్సరీ నిర్వహించొద్దని, ప్రభుత్వం ఆమోదం పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. అలాగే, పూర్తిస్థాయిలో వివరాలతో రికార్డులు నిర్వహిస్తూ రైతులకు బిల్లులు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.50 వేలు జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష.. నష్టం తీవ్రత ఆధారంగా రెండూ విధించే అవకాశముందని ఆయన తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు ఆకుల వేణు, జి.నగేశ్, ఎ.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కుటుంబ నిర్ధారణ సర్వే

కొణిజర్ల: ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ అర్హులందరికీ అందేలా చేపడుతున్న కుటుంబ నిర్ధారణ సర్వేలో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. మండలంలోని పల్లిపాడు రైతు వేదికలో శనివారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. అన్ని మండలాలతో పోలిస్తే కొణిజర్ల మండలం సర్వేలో ముందంజలో ఉందని తెలిపారు. వైరా ఏడీఏ కరుణశ్రీ, కొణిజర్ల ఏఓ బాలాజీ, ఏఈఓలు సరిత, హర్షవర్ధన్, అఫ్రిన్, కుమారరాజా తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల పెన్షన్.. బతుకంతా టెన్షన్

- ఏళ్లుగా సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన
- పాలకులు మారుతున్నా అదే సమస్య
- నేడు విద్రోహదినంగా పాటిస్తూ నిరసనలు

ఖమ్మంసహకారనగర్: ప్రస్తుత ప్రపంచంలో రూ.లక్షల జీతాలు వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా చిన్నదైనా సరే ప్రభుత్వం ఉద్యోగం కావాలని పలువురు కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నప్పుడైనా, రిటైర్ అయ్యాక కూడా భరోసా ఉంటుందని నమ్మేవారు. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తాయి. ఉద్యోగ విరమణ తర్వాత సైతం ఆర్థిక భద్రత, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినా కుటుంబానికి తోడ్పాటు, ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగికి సామాజిక భద్రతగా పెన్షన్ ఉంటుందనేది ఒకప్పటి మాట. రెండు దశాబ్దాలుగా అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు భవిష్యత్‌పై భరోసా లేకుండా చేస్తుండడంతో పాత పింఛన్ స్కీంను పునరుద్ధరించాలనే డిమాండ్‌పై ప్రభుత్వాలు స్పందించడం లేదు.

2004 నుంచి అమలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్ అమల్లోకి వచ్చింది. తొలి నుంచి ఈ విధానాన్ని దేశ వ్యాప్తంగా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. అయినా రద్దు చేయకపోవడంతో ఏటా సెప్టెంబర్ 1వ తేదీన విద్రోహదినంగా పాటిస్తూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నారు. అయితే, తెలంగాణ ఏర్పాటైనప్పుడు సీపీఎస్ నుంచి వైదొలగడానికి అవకాశం వచ్చినా పట్టించుకోలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 15 వేల మంది

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం సీపీఎస్ విధానంలో సుమారు 15 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 100 మందికి పైగా ఉద్యోగులు కన్నుమూశారు. అయినప్పటికీ సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన ఫ్యామిలీ పెన్షన్ జీఓ అసమగ్రంగా ఉండటంతో వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇక జిల్లాలో సీపీఎస్ విధానంలో రిటైర్ అయిన వారు పదుల సంఖ్యలో ఉండగా అతి తక్కువగా పింఛన్ అందుతోందని చెబుతున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉద్యోగులు చేసిన ఆందోళనల ఫలితంగా చనిపోయిన ఉద్యోగులకు 2021లో ఫ్యామిలీ పెన్షన్ ఇచ్చారు. అలాగే, చనిపోయిన, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు 2018లో గ్రాట్యుటీ కూడా ఇచ్చారు. అయినా ఉద్యోగులు మాత్రం సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో పోరాడుతున్నారు.

కొన్ని చోట్ల అమల్లోకి ఓపీఎస్

ఉద్యోగుల ఆందోళన ఫలితంగా రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను పునరుద్ధరించారని సీపీఎస్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈనేపథ్యాన తెలంగాణలో కూడా ఓపీఎస్‌ను పునరద్ధరించాలనే డిమాండ్‌తో ఆదివారం ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రత్యామ్నాయం మరొకటి లేదు...



– చంద్రకంటి శేఖర్, టీఎస్ సీపీఎస్ ఈయూ, జిల్లా అధ్యక్షుడు

ఓపీఎస్‌లో రిటైర్ అయ్యే నెలలో మూలవేతనం నుంచి సగం పింఛన్ అందేది. ఇప్పుడు ప్రతినెలా చందా చెల్లిస్తున్నా భరోసా లేదు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ విధానంలో చందా చెల్లించి 25ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికే మూలవేతనంలో సగం పెన్షన్ ఇస్తామంటోంది. ఓపీఎస్‌నే పునరుద్ధరించాలి.

పెన్షన్ రూ.3,173 వస్తోంది



– కొంటు రాజు, రిటైర్డు ఉద్యోగి, ఖమ్మం

అర్బన్ మలేరియా ఫీల్డ్ వర్కర్‌గా 2001లో రూ.2,500 జీతంతో చేరాను. 2006లో పర్మనెంట్ అయినప్పుడు రూ.4,700 జీతం ఉంది. ఇటీవల రూ.55,815 వేతనంతో రిటైర్ అయితే రూ.3,173 పింఛన్ మాత్రమే వస్తోంది. ఈ నగదుతో నా కుటుంబ కనీస అవసరాలు తీరకపోగా మందు బిళ్లలకు కూడా సరిపోవడం లేదు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



– ఎం.శ్వేత, ఆర్ అండ్ బీ శాఖ ఉద్యోగి

రాష్ట్రప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలి. ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామన్న రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేశాయి. తెలంగాణలో కూడా ఓపీఎస్‌ను పునరుద్ధరించి 2.50 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి.

వరదలో చిక్కుకున్న పలువురు..



మామునూరుపేట వరదలో సాయం కోసం చూస్తున్న అశోక్, కృష్ణారావు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని మామునూరుపేట చెరువు అలుగువాగులో కొట్టుకుపోయిన ఇద్దరిని స్థానికులు కాపాడారు. మామునూరుకు చెందిన గంగారపు కృష్ణారావు, కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన పాటిబండ్ల అశోక్ శనివారం భీమవరం నుంచి బైక్‌పై మామునూరు వస్తుండగా అలుగువాగు దాటే క్రమంలో వరద పెరిగింది. దీంతో వాహనంతో సహా కొట్టుకుపోయిన వారు కట్లేరు కల్వర్టు గోడను ఆసరా చేసుకుని ఆగారు. వీరిని రెవెన్యూ ఉద్యోగి గంతాల వెంకటేశ్వరరావు గమనించగా, అప్పటికే కృష్ణారావు తన స్నేహితులకు సమాచారం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు బండారు నర్సింహారావు, గోను రామారావు, లక్కిరెడ్డి జగన్మోహన్‌రెడ్డితో పాటు అక్కడే ఉన్న మహారాష్ట్రకు చెందిన ధనూ, మామునూరుకు చెందిన కన్నెబోయిన రామకృష్ణ కలిసి కృష్ణారావు, అశోక్‌ను బయటకు తీసుకొచ్చారు.

- మీనవోలు – పెగళ్లపాడు ఆర్వోబీ మధ్య ప్రధాన రహదారిపై కట్లేరుకు వరద రావడంతో రోడ్డు జలమయమైంది. అదే సమయాన వస్తున్న ఆర్టీసీ బస్సు చిక్కుకోవడంతో పోలీసులు, స్థానికులు ప్రయాణికులను కాపాడారు.
- భీమవరం – భవానీపురం మధ్య నక్కలవాగుకు వరద రావడంతో భవానీపురానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు(19) గల్లంతయ్యాడు. భీమవరం నుంచి స్వగ్రామానికి స్నేహితుడు కొండపల్లి రఘు చేయి పట్టుకుని వాగు దాటుతుండగా ఆయన గల్లంతవడంతో స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, 9.30 గంటల తర్వాత ఆయన మృతదేహం కిలోమీటర్ దూరాన లభ్యమైంది.



సాంబశివరావు (ఫైల్)

- ఎర్రుపాలెంలోని ఊర చెరువు నిండి గ్రామపంచాయతీ కార్యాలయం మీదుగా రైల్వేస్టేషన్ ఆవరణలోకి వరద చేరింది. ఊర చెరువుకు మరింత వరద చేరుతుండటంతో తెగిపోయే పరిస్థితికి చేరగా.. గండి పడితే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది.
- మధిర: మండలంలోని దెందుకూరులో నన్నెబోయిన పద్మ (30) గేదెలను తీసుకొస్తుండగా ఆర్‌యూబీ సమీపాన వరదలో గల్లంతైనట్లు తెలిసింది. ఆమె ఆచూకీ కోసం గ్రామస్తులు గాలింపు చేపట్టారు.

వరద ఉధృతిని పరిశీలించిన అదనపు కలెక్టర్



చింతకాని - నాగులవంచ వద్ద వరదపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

చింతకాని: భారీ వర్షాలతో చింతకాని మండలం నాగులవంచ వద్ద ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారిపైకి శనివారం వరద చేరింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. వరద ఉధృతి నేపథ్యాన వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి నష్టం జరగకుండా సూచించారు. అయితే, పర్యవేక్షించాల్సిన ఎంపీడీఓ అందుబాటులో లేకపోవటంతో అదనపు కలెక్టర్ ఆయనకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ అనంతరాజు, ఎస్ఐ నాగుల్‌మీరా ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కొణిజర్ల: వర్షాల నేపథ్యాన అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. కొణిజర్ల తహసీల్‌లో ఆయన తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీఓ రాజేశ్వరితో సమావేశమై వరద పరిస్థితులను సమీక్షించారు. తహసీల్‌లోని కంట్రోల్ రూమ్‌లో అధికారులు సిద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించాలని తెలిపారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తనిఖీ..

వైరా: వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం, నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అయితే, సరుకులు నిల్వ ఉంచే గది శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సమత ఉన్నారు.

ఉత్తమ శాస్త్రవేత్తగా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్



డాక్టర్ రవికుమార్



రాణాప్రతాప్

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ రవికుమార్ రాష్ట్ర ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా పలువురు రైతులు, శాస్త్రవేత్తలకు అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా రవికుమార్ గత ఐదేళ్లలో రైతులకు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. కాగా, రవికుమార్ 2020, 2021, 2023లో సైతం ప్రభుత్వం, వివిధ సంస్థల ద్వారా ఉత్తమ శాస్త్రవేత్త అవార్డులు దక్కించుకున్నారు.

రాణాప్రతాప్‌కు ఉత్తమ రైతు అవార్డు

వైరారూరల్: మండలంలోని వల్లాపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. మెట్ట సేద్యంలో రాణాప్రతాప్ పాటించిన సస్యరక్షణ చర్యలను పరిగణనలోకి తీసుకొని అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 3న హైదరాబాద్‌లో జరిగే యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఆయన అవార్డు స్వీకరిస్తారు. గతంలో కూడా ఆయన మండల, జిల్లాస్థాయి ఉత్తమ రైతుగా అవార్డులు అందుకున్నారు.

రాణించిన టీ.టీ. క్రీడాకారులు



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలబాలికల అండర్–11 విభాగంలో షేక్ ఫైజల్, అనెం ఉజ్వల్, బొంతు సాయి, శివానీ, కోటగిరి హితేశ్, ఈలప్రోలు హరి, అండర్–13 విభాగంలో చార్విక్, అనస్, శ్రీయాన్, హారిక, శ్రీలక్ష్మి, తన్మయిశ్రీకి ప్రత్యేక బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డాక్టర్ శశికుమార్, బాలసాని విజయ్‌కుమార్, ప్రకాష్‌రాజు, దినేశ్‌సింగ్, వీవీఎస్.సాంబమూర్తి, నరేశ్‌రెడ్డి, రాము, ప్రవీణ్, జానీపాషా, నాగరాజు అభినందించారు.

పేదలను విస్మరించిన మోదీ పాలన

రేపు సీపీఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలను విస్మరించి పాలన సాగిస్తోందని.. సంపన్నవర్గాలు, కార్పొరేట్ శక్తుల కోసమే వారు పనిచేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు. దశాబ్దకాలంలో నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరగగా, అల్పాదాయ వర్గాల రాబడి మాత్రం కనిష్ఠస్థాయికి చేరిందన్నారు. గత పాలకులు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ చట్టాన్ని అమలు చేయగా, మోదీ ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రసాయనిక ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక జనగణన చేయకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ పథకాలు దక్కడం లేదని తెలిపారు. ఇకనైనా జనగణన చేపట్టడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ప్రసాద్ కోరారు. సమావేశంలో నాయకులు తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజం ఓ శాస్త్రీయ సిద్ధాంతం

ఖమ్మంమయూరిసెంటర్: మార్క్సిజం ఓ శాస్త్రీయ సిద్ధాంతమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో వై.విక్రమ్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన పార్టీ రెండో విడత రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మానవ సమాజం ఉన్నంత కాలం మార్క్సిజం ఉంటుందన్నారు. ఈ నేపథ్యాన మార్క్సిస్టులు ప్రజా సమస్యలను విశ్లేషిస్తూ పరిష్కార మార్గాన్ని చూపాలని తెలిపారు. కాలానుగుణంగా చోటు చేసుకునే మార్పులను మార్క్సిస్టులు అందిపుచ్చుకుని పాలకుల వ్యూహాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాగా, తొలి రోజు శిక్షణా తరగతుల్లో సీపీఎం నాయకులు బండారు రమేశ్, పి.సోమయ్య వివిధ అంశాలపై మాట్లాడారు. తొలుత ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ రూపొందించిన శౌర్య యాత్ర కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 1 నుంచి 17 వరకు 'వీరులు నడిచిన దారుల్లో...' పేరిట నిర్వహించే శౌర్యయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కారేపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్ముగూడెం స్టేజీ వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబోడుకు చెందిన రైతు పందుల సోమయ్య (54) రెండు రోజుల కిందట తన కుమారుడు వీరబాబు నివాసముంటున్న నేలకొండపల్లి మండలం అప్పల నరసింహాపురం వెళ్లాడు. అక్కడ తన కుమారుడు మిర్చి తోట వేస్తుండగా పనులో సాయం చేసి శనివారం తిరుగు పయనమయ్యాడు. ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి ఎర్రబోడు వెళ్లేందుకు కొమ్ముగూడెం స్టేజీ వద్ద దిగిన ఆయన రోడ్డు దాటుతుండగా ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వేగంగా వెళ్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో సోమయ్య తలకు తీవ్ర గాయం కావడంతో మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా, సోమయ్యకు భార్య వీరమ్మ, కుమారుడు వీరబాబు, కుమార్తె వాణిశ్రీ ఉన్నారు.



సోమయ్య (ఫైల్)

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

ఖమ్మంసహకారనగర్: ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యాన జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించారు. ఈ డైరీని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఆవిష్కరించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, సీపీఓ శ్రీనివాస్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఆస్తులను పరిరక్షిస్తాం



మాట్లాడుతున్న చైర్మన్ కొత్వాల

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఆస్తులను కొందరు ఆక్రమించాలని యత్నిస్తున్నందున ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు మధిరలో ఉన్న ఆస్తులను కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా పోలీసుల సహకారంతో రక్షించుకున్నామని తెలిపారు. అనంతరం డీసీఎంఎస్ అభివృద్ధి, ఇతర వ్యాపార కార్యకలాపాలపై సమావేశం నిర్వహించి చర్చించారు. డైరెక్టర్లు నాగుబండి శ్రీనివాసరావు, పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, తేళ్ల కోటయ్య, మారుతి ఎట్టయ్య, బిజినెస్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.85లక్షలకు ఐపీ దాఖలు చేసిన వ్యాపారి

ఖమ్మం లీగల్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని మామిళ్లగూడెంకు చెందిన వ్యాపారి రావిరాల శివనాగ ప్రసాద్ రూ.85.70లక్షలకు గాను దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. మణికంఠ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ షాపు నిర్వహించిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్దే కాక మనీ లోన్ యాప్‌లు, క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు తీసుకున్నాడు. ఆపై వ్యాపారంలో తీవ్రంగా నష్టం వచ్చిందని, రుణం తీర్చే మార్గం లేదంటూ 18 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ

సత్తుపల్లి: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్ నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆమె ఖమ్మం వెళ్లే బస్సు ఎక్కుతుండగా ఇద్దరు ఆగంతకులు బస్సు దిగుతున్నట్లు హడావుడి చేశారు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌లో చూసేసరికి సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో మరొకరి ఫోన్ నుంచి కాల్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్‌కు ఫిర్యాదు చేయగా బస్టాండ్‌లోని సీసీ టీవీల పుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. బస్టాండ్‌లో నిఘా మరింత పెంచుతామని సీఐ తెలిపారు.